క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 16న వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ డీఈ శంకేశి మల్లికార్జున్ తెలిపారు. పోతన, పోచమ్మమైదాన్, ఏనుమాముల సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రూప్ -4 ఉద్యోగాల్లో 'ఎస్సీ స్టడీ సర్కిల్' అభ్యర్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: హనుమకొండలోని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రంలో (ఎస్సీ స్టడీ సర్కిల్) గ్రూప్ -4 ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకున్న అభ్యర్థుల్లో 8మంది ఉద్యోగాలు సాధించారని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్ శుక్రవారం తెలిపారు. ఈమేరకు ఉద్యోగాలు సాధించిన ఈ.రాధిక, ఎం.స్వప్న, మౌనిక, ఎన్.నిశాంత్, టి.నేతాజీ, సునీల్‌కుమార్, చక్రబాబు, నవీన్‌ను అభినందించారు.

పద్మాక్షి అమ్మవారికి మహాహారతి



హన్మకొండ అర్బన్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని నగరంలోని పద్మాక్షి కాలనీలోని పద్మాక్షి దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం మహా హారతి ఇచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేసినట్లు వివరించారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణేష్



విద్యారణ్యపురి: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరంగల్ జిల్లా నర్సంపేట మండలానికి చెందిన ఉపాధ్యాయుడు దార గణేష్ ఎన్నికై నట్లు టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని విజయ రత్న హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణేష్‌ను ఎన్నుకున్నట్లు బాబు వివరించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం కమ్మపెల్లిలోని జెడ్పీఎస్‌ఎస్‌లో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా దార గణేష్ పనిచేస్తున్నారు.

ఆటో యూనియన్ కమిటీల ఎన్నిక

కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ ఆదేశాల మేరకు ఆటో యూనియన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. హనుమకొండలోని ఏకశిల పార్కులో ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బరిగెల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బండారి శ్రీకాంత్, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఆమంచ ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా పెసర శివశంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆడెపు వెంకన్న, సిరికొండ సదానందం, ఆవుల నవీన్‌కుమార్, మస్కే కరుణాకర్, నర్సయ్య, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో ఆటో చోరీ

కాజీపేట: కాజీపేట పట్టణ ప్రధాన రహదారి పక్కన పార్కింగ్ చేసిన ఓ ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం సాయంత్రం చోరీ చేశారు. స్థానిక ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన భూక్యా రాజ్‌కుమార్.. ఓ బార్ సమీపంలో ఆటోను పార్క్ చేశారు. కిరాణంలో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసి వచ్చేలోపు ఆటో కనిపించలేదు. దాంతో ఆటో డ్రైవర్ రాజ్‌కుమార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మడికొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మడికొండలో జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ వినాయక నగర్‌లోని నార్లగిరి వనమాల ఇంట్లో ఎవరు లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ అయి పొగలు బయటకు రావడంతో చుట్టుపక్క వాళ్లు స్పందించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి, బియ్యం, దుస్తులు కాలిబూడిదయ్యాయి. రూ.సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, బాధితులను స్థానిక నాయకులు దువ్వ శ్రీకాంత్, నవీన్, తదితరులు పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు.

బంగారు గొలుసు అపహరణ

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట రుద్రమనగర్ కాలనీలో బంగారు చైన్ చోరీకి గురైందని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. రంగశాయిపేట రుద్రమనగర్‌కు చెందిన అబ్బురబోయిన వరలక్ష్మి గురువారం రాత్రి నిద్రించేముందు తన మెడలోని సుమారు రూ.1.60 లక్షల విలువైన మూడు తులాల బంగారు గొలుసును బ్యాగులో భద్రపరిచింది. శుక్రవారం ఉదయం లేచి చూసేసరిగా బ్యాగులో గొలుసు కనిపించకపోవడంతో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 4గంటల నుంచి నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. తెల్లవారక ముందే మహిళలు తులసి పూజచేసి కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం ఇళ్ల ముంగిట దీపాలతో అలంకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



హన్మకొండ కల్చరల్: సాయి సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు



మెట్టుగుట్ట ఆలయంలో దీపోత్సవంలో భక్తులు



వేయి స్తంభాల ఆలయంలో..



కాశీ విశ్వేశ్వరాలయంలో జ్వాలాతోరణం



మధ్యకోటలో..



గోవిందరాజుల దేవాలయంలో..



వేయి స్తంభాల ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దీపోత్సవంలో యువతులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో..



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు





దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కేయూకు ఇన్ఫోసిస్ కంప్యూటర్ల వితరణ

కేయూ క్యాంపస్: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి విడతగా 60 కంప్యూటర్లను కాకతీయ యూనివర్సిటీకి ఇటీవల అందజేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కంప్యూటర్‌ను ల్యాబ్‌లు ఉన్న క్యాంపస్‌లోని కెమిస్ట్రీ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల, యూనివర్సిటీ పీజీ కళాశాల, సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, పరిపాలన భవనంలో, వివిధ విభాగాల్లో అవసరం ఉన్నచోట పలు కంప్యూటర్లను బిగించినట్లు తెలిపారు. యూనివర్సిటీకి ఇన్ఫోసిస్ సంస్థ 60 కంప్యూటర్లు అందించేలా కృషి చేసిన వంశీ మత్స్యపు, మనీషాసాబు, పద్మజా రమణికి రిజిస్ట్రార్ మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



కేయూ కెమిస్ట్రీ విభాగంలో కంప్యూటర్ ల్యాబ్

జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న శశిజాదేవి

హన్మకొండ చౌరస్తా: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా హనుమకొండ జిల్లా గ్రంథాలయ ఆవరణలో పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిట్స్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డి హాజరై మాట్లాడుతూ లైబ్రరీలోని పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులకు దేశభక్తి గేయ విభాగంలో పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి శశిజాదేవి, సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ డీడీ చంద్రమౌళి, డిప్యూటీ లైబ్రేరియన్ కరుణకుమారి, లైబ్రేరియన్లు మల్సూరు, పురుషోత్తం రాజు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, టైపిస్ట్ కుమారస్వామి, గుడికందుల రాజేష్, సామాజికవేత్తలు నిమ్మల శ్రీనివాస్, సాగంటి మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమ మెడికల్ కళాశాలకు పార్థివ దేహం అప్పగింత

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో గడ్డం శైలజ (35) వారం రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈమేరకు ఆమె మృతదేహాన్ని వైద్యవిద్య నిమిత్తం మెడికల్ కళాశాలకు అప్పగించేందుకు మృతురాలి భర్త గడ్డం కిరణ్ కుమార్, కుమారులు సాయికుమార్, గౌతం ముందుకు వచ్చారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో శైలజ పార్థివ దేహాన్ని ఆరెపల్లిలోని ప్రతిమ మెడికల్ కళాశాల అనాటమీ హెచ్‌ఓడీ గణేష్, అనాటమీ విభాగానికి చెందిన ప్రభాకర్‌కు అప్పగించారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కేఎంసీకి సెలవు కావడం, ఎంజీఎంలో మార్చురీ పనిచేయకపోవడంతో ప్రైవేట్ మెడికల్ కళాశాలకు పార్థివ దేహాన్ని అప్పగించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా అవయవ, శరీర, నేత్ర దానం చేయాలనుకున్నవారు 87905 48706 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజమౌళి, సలహాదారు రాజేంద్రప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పార్థివదేహం అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

పారిశుద్ధ్య కార్మికుడిపై దాడి

హసన్‌పర్తి: నగరంలోని 1వ, 55వ డివిజన్లలో స్వచ్ఛ ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న వీర మొగిలిపై దాడి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం భీమారానికి చెందిన వీర మొగిలి.. జీడబ్ల్యూఎంసీలో ఆటో డ్రైవర్ విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం చెత్త సేకరించడానికి వెళ్లగా భీమారం బస్టాండ్ వద్ద మొగిలికి బాబోయి హోటల్ యజమాని బావమరిది శివకృష్ణ మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో ఆగ్రహానికి గురైన శివకృష్ణ.. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇనుప రాడుతో మొగిలిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

నలుగురు బీటెక్ విద్యార్థులపై కేసు

హసన్‌పర్తి: నగర శివారులో ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులపై కేసు నమోదైనట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. హసన్‌పర్తి మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు గంజాయి తాగుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై రవి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు శివసాయి, సాత్విక్‌రెడ్డి, దినేష్, దక్షిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

అఘోరీమాత హల్‌చల్



ఖిలా వరంగల్: సనాతన ధర్మ పరిరక్షణ, స్త్రీలపై జరుగుతున్న అఘాత్యాల నిర్మూలన, లోక కల్యాణం కోసమే పాదయాత్ర చేస్తున్నానని నాగసాధువు అఘోరీమాత పేర్కొన్నారు. వర్ధన్నపేట మీదుగా ఖిలా వరంగల్ మండలం మామునూరు క్రిస్టియన్ సమాధులు (శ్మశానవాటిక) ప్రాంగణంలోకి కారులో అఘోరీమాత శుక్రవారం సాయంత్రం చేరుకుంది. ఈమేరకు శ్మశాన వాటికలో కొద్దిసేపు హల్‌చల్ చేసింది. మామునూరు శ్మశాన వాటిక నుంచి భద్రకాళి ఆలయం వరకు పాదయాత్ర వెళ్లి అమ్మవారిని దర్శించుకుంది. ఈక్రమంలో మామునూరు ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్, స్పెషల్ పోలీసులు పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా

పోరాటాలకు సిద్ధం కావాలి



ఖిలా వరంగల్: ఆటో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపై పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ నాయకుడు ఎండీ.మహబూబ్ పాషా ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలోకి ఆటో కార్మికులు చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఏఐటీయూసీలోకి శ్రీనివాసరావు ఆహ్వానించారు. కార్యక్రమంలో బాషుమియా, పనాస ప్రసాద్, కందికచెన్న కేశవులు, బుస్స రవీందర్, యాకూబ్, అమ్జద్, హబీబొద్దీన్, ముస్తఫా, సజ్జ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

కాజీపేట అర్బన్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్ కోరారు. హనుమకొండలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎంఈఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను మాల కులస్తులు అడ్డుకోవడమంటే సామాజిక న్యాయం, అంబేడ్కర్ ఆశయాలను అడ్డుకోవడమేనని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు కుమ్మరి రాజన్న, సోమారపు అయిలయ్య, స్వామి, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐని కలిసిన రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్



వరంగల్ లీగల్: సుప్రీంకోర్టు నూతన చీఫ్ జస్టిస్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సంజీవ్ ఖన్నాను తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ బైరపాక జయకర్ న్యూఢిల్లీలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీజేఐకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

24న పద్మశాలి కార్తీక వన భోజనాలు

వరంగల్ చౌరస్తా: ఈనెల 24న వరంగల్ వాకర్స్ గ్రౌండ్‌లో జరగనున్న కార్తీక మాస వనభోజన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పద్మశాలి కులస్తులు పాల్గొనాలని జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్ విజ్ఞప్తి చేశారు. వరంగల్ చార్‌బౌలిలోని పద్మశాలి పంక్షన్ హాల్‌లో కార్తీకమాస వన భోజనాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు కుసుమ సతీష్, అధ్యక్షుడు డీఎస్.మూర్తి, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, రాష్ట్ర పోపా అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు అన్నదానం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డుని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 29 నుంచి 41 రోజుల పాటు అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు ఆలయ ఆవరణలో కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. మాలాధారులకు అన్నదానం చేయాలనుకునే వారు రూ.4,016 అందజేస్తే వారి పేరు మీద అన్నదానం చేస్తామని తెలిపారు. ఈనెల 29నుంచి జనవరి 5వ తేదీ వరకు మాలధారులకు అన్నదానం చేస్తామని వివరించారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు వెలిశాల ఆనంద్, కూచన ఏకాంబ్రం, దాసరి రాజేష్, కూచన రవీందర్, సామల సదానందం, శ్రీధర్, గురుస్వామి అర్చకులు శ్రీకాంతాచారి, మధుచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ప్రచారంలో జిల్లా నేతలు

వరంగల్: మహారాష్ట్రలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో వరంగల్ జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. నాగపూర్, వర్ధా జిల్లాలోని హింఘన్‌ఘాట్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలిచిన సమీర్ కునావర్‌తో కలిసి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరబెల్లి ప్రదీప్‌రావు, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు శుక్రవారం పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



కాశిబుగ్గ: కనకదుర్గామాత దేవాలయంలో వ్రతం



కాజీపేటలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

కాశిబుగ్గ: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని 19, 20వ డివిజన్లలోని కనకదుర్గమాత దేవాలయం, రంగనాథస్వామి దేవాలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తులు శుక్రవారం నిర్వహించారు. రంగనాథస్వామి దేవాలయ ప్రాంగణంలో గ్రానైట్ నిర్మాణానికి గోసికొండ సుధాకర్, శంకుతల దంపతులు రూ.2 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్వేతార్క ఆలయంలో..

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని శ్రీరమ సమేత పరివార సత్యనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు టంటం దయాకర్ స్వామి ఆధ్వర్యంలో భక్తులు వ్రతం ఆచరించారు. కార్తీక పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని దాదాపు మూడు దశాబ్దాలుగా భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్నారు. పూజా కార్యక్రమాల్లో అర్చకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం



అనఘాష్టమి వ్రతం చేస్తున్న మహిళలు

ఖిలా వరంగల్: కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణం రామలింగేశ్వర స్వామి సన్నిధిలో అనఘాష్టమి వ్రత పూజ నేతపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరామ్ రాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యాంసుందర్, యాదగిరి, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో బిర్సాముండా జయంతి

కేయూ క్యాంపస్: బిర్సా ముండా వందో జయంతి ఉత్సవాల్లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఆదివాసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. బిర్సా ముండా జయంతిని ఆదివాసీ జన జాతీయ గౌరవ దివస్‌గా కేంద్రప్రభుత్వం గుర్తించింది. ఈమేరకు బిర్సా ముండా చిత్రపటానికి కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ, విద్యార్థులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్సాముండా పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. జార్కండ్ రాష్ట్రంలో 1875, నవంబర్ 15న ఆదివాసీ కుటుంబంలో బిర్సాముండా జన్మించారని, 25 ఏళ్ల వయస్సులోనే బ్రిటిష్ వారితో పోరాడి అమరుడయ్యాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో తాటి అనిల్, నరహరి, నవీన్, గౌతమ్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఈసం నారాయణ, విద్యార్థులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

కాజీపేట అర్బన్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. కాజీపేట మండల పరిధిలోని 31, 47, 48, 61, 62, 63వ డివిజన్లలోని 48 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ కార్యక్రమాన్ని కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీరజాలీ, మామిండ్ల రాజు, సంకు నర్సింగ్, మాజీ కార్పొరేటర్లు అబుబక్కర్, సుంచు అశోక్, తహసీల్దార్ బావుసింగ్ నాయక్, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

గురునానక్ సిద్ధాంతాలు ఆదర్శం

నయీంనగర్: మహిళలను గౌరవించాలని, బాహ్య ప్రపంచాన్ని గెలవడానికి ముందు తమలో అంతర్గతంగా ఉన్న దుర్గుణాలను తొలగించుకోవాలని ప్రబోధించిన గురునానక్ సిద్ధాంతాలను అందరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సూచించారు. గురునానక్ జయంతి సందర్భంగా కిషన్‌పుర గురుద్వారలో ఆయన పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి సహాయం

8వ డివిజన్ గుడిబండల్‌లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో ధ్వంసమైన తాటి రజిత – సదానందం ఇంటిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. తక్షణ సహాయం కింద రూ.5వేలు అందించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటిని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

నేతన్నా.. ఆత్మహత్యలు వద్దన్నా

కాజీపేట అర్బన్: నేతన్నలు ఆత్మహత్యకు పాల్పడవద్దని అఖిల భారత పద్మశాలి హనుమకొండ జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు సిరిసిల్ల నేతన్న దంపతుల ఆత్మహత్యకు నిరసనగా అదాలత్ సెంటర్‌లో శుక్రవారం నివాళులర్పించి కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ మాట్లాడుతూ సిరిసిల్లకు చెందిన బైరి అమర్, స్రవంతి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన యావత్ పద్మశాలి లోకాన్ని కలచివేసిందని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శి కేదాశి వెంకటేశ్వర్లు, రాజగోపాల్, చిప్ప వెంకటేశ్వర్లు, భాస్కర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు